అమ్మో.. పెద్దఅంబర్‌పేటకా ?

ఇక్కడ పోస్టింగ్ అంటేనే అధికారుల వెనుకడుగు

- మూడు నెలలుగా టీపీవో పోస్టు ఖాళీ
- ఈ నెల 6న టీపీవోను నియమిస్తూ ఉత్తర్వులు జారీ
- 20 రోజులు గడిచినా బాధ్యతలు తీసుకోని టీపీవో
- ఇబ్బందిపడుతున్న టీఎస్‌బీపాస్ దరఖాస్తుదారులు

అబ్దుల్లాపూర్‌మెట్ మార్చి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో పోస్టింగ్ అంటేనే అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. మున్సిపాలిటీలో ఏదైనా పోస్టు ఖాళీ అయితే తిరిగి ఆ పోస్టు భర్తీ అయ్యేందుకు కొన్ని నెలలు ఎదురుచూడాల్సిందే. అది కూడా అధికారి ధైర్యం చేసి వస్తే తప్ప ఇక్కడ ఖాళీ పోస్టు భర్తీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. వచ్చిన అధికారి సైతం ఇక్కడ ఎన్ని రోజులు పని చేస్తాడో తెలియని పరిస్థితి. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఈ దుస్థితి నెలకొంది. అక్రమ నిర్మాణాల విషయంలో ఇక్కడి ప్రజా ప్రతినిధులు, నాయకుల ఒత్తిడితోనే అధికారులు ఇక్కడ పని చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

పరిమిషన్ జారీలో జాప్యం..

మూడు నెలలుగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో టీపీవో(టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్)అందుబాటులో లేరు. దీంతో టీఎస్‌బీపాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఇంటి నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీపీవో లాగిన్ సైతం క్లోజ్ చేయడంతో ఆన్‌లైన్ దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పరిమిషన్ కోసం దరఖాస్తు చేసుకుని నెల రోజులు గడుస్తున్నా అనుమతులు జారీ కాకపోవడంతో పలువురు దరఖాస్తుదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే అనుమతులు జారీ అవుతాయని ప్రభుత్వం చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం(ఫైల్)

టీపీవో లేక ఇబ్బందులు..



కొంత కాలంగా టౌన్‌ప్లానింగ్ అధికారి లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుంది. పరిమిషన్లు, కోర్టు కేసులు, అక్రమ నిర్మాణాల నియంత్రణ తదితర విషయాల్లో ఇబ్బంది నెలకొంది. వెంటనే మున్సిపాలిటీకి టీపీవోను కేటాయించాలని ఉన్నత అధికారులను కోరా.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

జాయిన్ అయ్యేందుకు టీపీవో విముఖత..?

ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించిన టీపీవో శ్రీకాంత్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ. శ్రీనివాసుకు సర్దుబాటులో భాగంగా తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ టీపీవోగా నియమిస్తూ డీటీ/సీపీ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తుర్కయంజాల్‌లో సోమవారం నుంచి బుధవారం, పెద్దఅంబర్‌పేట్‌లో గురువారం నుంచి శనివారం వరకు విధులు నిర్వహించేలా ఈ నెల 6వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వారం రోజుల క్రితం తుర్కయంజాల్ టీపీవోగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఉత్తర్వులు జారీ అయి 15 రోజులు అవుతున్నా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో మాత్రం జాయినింగ్ కాలేదు. ఆయన ఇక్కడ పని చేసేందుకు తీవ్ర విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న న్యాయాధికారి ఇందిర

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

- అవగాహన సదస్సులో వక్తలు

ఎల్‌బీనగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర, శ్యామలదేవి, నోడల్ అధికారి రమేష్ సూచించారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా వికలాంగుల పునరావాస కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ ఒక జన్యు సంబంధమైన వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో క్రోమోజోమ్ 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడు ఉంటాయన్నారు. అందువల్ల దీన్ని ట్రైసోమి 21గా పిలుస్తారన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లల్లో ఎదుగుదల ఉండదన్నారు. ఆలోచనాశక్తి కూడా తక్కువగా ఉంటుందన్నారు. డౌన్ సిండ్రోమ్ లక్షణాలు, నివారణ గురించి వివరించారు. అందుకోసం గర్భిణులు ఆరోగ్యవంతమైన పిల్లల కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న పిల్లలకి విశేషంగా సేవలు అందిస్తున్న వైద్యులు సుస్మిత, జయశ్రీ, రమాదేవిలను న్యాయాధికారి ఇందిర సత్కరించారు. కార్యక్రమంలో డీడీఆర్‌సీ సభ్యులు, డౌన్ సిండ్రోమ్ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగిన బాక్స్‌డ్రైన్ పనులను పునరుద్ధరించండి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో ఆగిన బాక్స్ డ్రైన్ పనులను త్వరగా పునరుద్ధరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టిన నాగేశ్వర్‌కాలనీ, ఎస్ఆర్‌ఎల్‌కాలనీ, సత్యానగర్ గాయత్రీపురం కాలనీల్లో కార్పొరేటర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ముగిసిన ప్రాంతాల్లో మట్టి కుప్పలను పనులు జరిగిన చోట గుంతల్లోకి తరలించాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి, మట్టి తరలింపు పనులు చేపట్టగా వాటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


కల్యాణంలో ఎంపీటీసీ అనితామహేందర్‌గౌడ్ తదితరులు

ఘనంగా సోమలింగేశ్వరస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరావిరాలలో మాణిక్యాంబ సమేత సోమలింగేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ ఎంపీటీసీ మరగొని అనితామహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కన్నె మల్లేష్‌యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేడుకలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి తలంబ్రాలు పోసి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురకంటి వనజాశ్రీనివాస్‌రెడ్డి, జాలిగం వెంకటేష్‌నేత, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, బసవయ్య, కిషన్‌గౌడ్, కళ్లెం లింగారెడ్డి, సత్యనారాయణ, భాస్కర్, శేఖర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాలలో ఆలయ వ్యవస్థాపకులు, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి


ఘనంగా మహా మృత్యుంజయ హోమం

చంపాపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రెండో రోజు శ్రీవల్లి దేవసేన సమేత, రమాలక్ష్మీ అమ్మవార్లకు ధ్వజస్తంభానికి ధాన్యదివాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి మహా మృత్యుంజయ పాశుపత హోమం హారతి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకాల రమేష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, విజ్జేశ్వర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌గుప్తా, మిరియాల అంజయ్యగుప్తా, హరీష్‌రెడ్డి, నిర్మలేష్‌గుప్తా, హరిగుప్తా, మణిపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌గుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చు


హాస్టల్ విద్యార్థికి కాంపిటేషన్ పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

వనస్థలిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చునని నక్క వెంకటమ్మ యాదవ్, నక్కా యాదగిరిస్వామి యాదవ్, ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్, సేవా రత్న అవార్డు గ్రహిత నక్కా శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న ఇరుగు పవన్ కళ్యాణ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించిన ఉచిత సివిల్ కోచింగ్‌లో పలు ఉద్యోగాలకు గాను ఫస్ట్ ర్యాంక్‌తో ఎంపికయ్యారు. త్వరలో జరిగే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపరేషన్ కావడానికి కావాల్సిన కాంపిటేషన్ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఆర్థిక ఇబ్బందుల మూలంగా కాంపిటేషన్ పుస్తకాలను అందించాలని శ్రీనివాస్‌యాదవ్‌ను అభ్యర్థించారు. దీంతో అందుకు కావాల్సిన కాంపిటేషన్ పుస్తకాలను ఆయన గురువారం విద్యార్థి పవన్‌కళ్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఉన్న అడ్డంకులను తొలగించుకుని పోటీ పరీక్షల్లో రాణించాలన్నారు.


రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరిగారి దాస్, మహిళా అధ్యక్షురాలు వెంకటమ్మ, నేనావత్ దేవి, అంజమ్మ అనిల్, సరోజ, లక్ష్మీ, అలివేలు, కృష్ణవేణి తదితరులు - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవాల్సిందే

- పార్టీ నేతలతో సీఎం స్పష్టీకరణ
- మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ తదితరులు


రేవంత్‌రెడ్డితో మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని కచ్చితంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఆ దిశలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి దంపతులు గురువారం పలువురు పార్టీ నేతలతో కలిసి సీఎం నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వారితో నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై కాసేపు ముచ్చటించారు. తాను చేవెళ్ల ఎంపీ స్థానానికి ఇన్‌చార్జిగా ఉన్నానని, ఎన్నికల సమయంలో ప్రచారానికి వస్తానని, పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి తీరాలని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వారితో పేర్కొన్నారు. వంద రోజుల్లో తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడేలా కృషి చేయాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ ఉనికి కూడా లేకుండా చిత్తుగా ఓడించాలని పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో బడంగ్‌పేట్ 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బాల్‌నింగని జంగయ్య, కాంగ్రెస్ నాయకులు పన్నాల రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంని కలిసిన వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

ఓల్డ్ మలకపేట మార్చి 21(ఆంధ్రజ్యోతి): వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం ఉదయం సీఎం నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేసి ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని సీఎం సూచించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు.

గువ్వకుంట అక్రమాలపై కదిలిన అధికారులు

- అక్రమ నిర్మాణాలు, ప్లాట్ల హద్దురాళ్ల తొలగింపు


తుర్కయంజాల్ గువ్వకుంట చెరువు కట్ట అంచుకు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

హయత్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని గువ్వకుంట కబ్జాపై అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీంద్రదత్తు, ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇరిగేషన్ ఏఈ తస్విన్ రజాల ఆధ్వర్యంలో చెరువులో నాటిన రాళ్లను తొలగించారు. చెరువు కట్టకు కడుతున్న ఇంటి నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. కొంత కాలంగా స్థానికులు చెరువును కాపాడాలని ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహించారు. చెరువు కట్టకే ఇంటి నిర్మాణం జరుగుతుందని తెలుసుకుని అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్‌తో అక్కడికి వెళ్లి అక్రమాలను తొలగించారు. దాదాపు 20.7 ఎకరాలలో ఉన్న చెరువు మొత్తం ప్లాట్లు గా మారింది. ఇప్పటికే చెరువు కట్ట ను దాదాపు చదును చేశారు. చెరు వు నీరు నిలిచే ప్రాంతం మొత్తం లో ప్లాట్ల హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. 20 ఎకరాల చెరువు కబ్జా అవుతున్నా అధికారులు ఆలస్యం గా స్పందించడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ రేటు ఆశ చూపి రియల్టర్లు అమాయక ప్రజలకు ఇప్పటికే ప్లాట్లను అంటగట్టారు. గతంలో అధికారులు ఏర్పాటు చేసిన చెరువు ఎఫ్‌టీఎల్‌లను నామరూపాలు లేకుండా చేశారు. గువ్వకుంట నోటిఫైడ్ చెరువు అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోక పోవడం వల్లనే చెరువు ప్లాట్లుగా మారిందని స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొర్రూర్‌లోని సర్వేనంబర్ 383లో అక్రమంగా వేస్తున్న గుడిసెలను కూడా అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఆర్ఐ భిక్షపతి తొలగించారు. మునగనూర్ గ్రామ పంచాయతీ వెనుక గల ప్రభుత్వ భూమిలో కూడా అక్రమాలు జోరందుకున్నాయని స్థానికులు తెలిపారు. ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండానే అక్రమంగా నిర్మాణాలు చేసి లక్షల్లో విక్రయిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అక్రమ నిర్మాణాలపైన కూడా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

పాత బకాయిలు చెల్లించి కొత్త రుణాలు తీసుకోండి

- సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి


సభలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణారెడ్డి

హయత్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ గురువారం చైర్మన్ చామ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు రూ. 46లక్షల స్వల్పకాలిక రుణాలు, రూ. 35 లక్షల దీర్ఘకాలిక రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు దీర్ఘకాలిక రుణాలు దాదాపు రూ. 3కోట్ల వరకు తీసుకునే అవకాశం ఉందని అన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అప్పులు చెల్లించి రైతులే మరో సారి రుణాలు పొందాలన్నారు. అనంతరం 2023-2024 సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరం ఆడిట్‌ను సభ ఆమోదించింది. తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ ప్రిన్సిపల్ వెంకన్న, సీఈవో మల్లికార్జున్, వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, డైరక్టర్లు విజయలక్ష్మి, అంజయ్య, సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, యాదమ్మ, నరసమ్మ, మేనేజర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

టిమ్స్ ఆస్పత్రి పనులను వేగిరం చేయాలి

- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు


మాట్లాడుతున్న క్రిస్టినా చోంగ్తు

రంగారెడ్డి అర్బన్ : కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి పనులను వేగిరం చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కొత్తపేట, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి గురువారం సమావేశాన్ని నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ ఆస్పత్రి పనులను ఆమె వైద్య ఆరోగ్య జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిపై ఆరాతీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్అండ్‌టి ఇంజనీర్లు వివరించారు. ఆస్పత్రి పనుల పరిశీలనలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- 15 రోజుల్లో 121 మందిపై కేసులు

కొత్తపేట: వేధింపులకు గురయ్యే మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందిన 130 ఫిర్యాదుల ఆధారంగా రాచకొండ పరిధిలోని ఆయా షీటీమ్స్ రంగంలోకి దిగి 121 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నాయన్నారు. ఎల్‌బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీటీమ్స్ కార్యాలయంలో గురువారం ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు నిందితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆకతాయిల్లో 64మంది మేజర్లు, 57మంది మైనర్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులపై 4 క్రిమినల్ కేసులు, 63 పెట్టీ కేసులు, 55 కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయని వివరించారు. బాధిత మహిళలకు మేమున్నామన్న భరోసానిస్తున్న షీటీమ్స్‌ను సీపీ తరుణ్‌జోషి అభినందించారు.

మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీటీంలు మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఏడుగురు ఆకతాయిలను పట్టుకుని, ఫైన్ కట్టించారు. అలాగే, యంజాల్‌లో ఉండే గృహిణితో స్నేహంగా ఉంటూ భర్త ఇంట్లో లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడో వ్యక్తి. అతడి బెదిరింపులు తట్టుకోలేక బాధితురాలు ఇబ్రహీంపట్నం షీ టీంస్‌ను ఆశ్రయించింది. షీటీమ్స్ రంగంలోకి దిగి నిందితుడిని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా జైలు శిక్ష పడింది.

ఈ నంబర్లకు కాల్ చేయండి..

బాధిత మహిళలు 87126 62111 (షీటీమ్ వాట్సాప్) నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 87126 62598 (భువనగిరి), 87126 62599 (చౌటుప్పల్), 87126 62600 (ఇబ్రహీంపట్నం), 87126 62601 (కుషాయిగుడ) 87126 62602 (ఎల్‌బీనగర్), 87126 62603 (మల్కాజిగిరి), 87126 62604 (వనస్థలిపురం) నంబర్ల ద్వారా షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

- టి.ఉషావిశ్వనాథ్, డీసీపీ, రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్

శాస్త్ర సాంకేతిక పరిశోధనలో ఐఐటీల ముందంజ

- ఘనంగా హైదరాబాద్ ఐఐటీ వ్యవస్థాపక దినోత్సవం

పటాన్‌చెరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ అన్నారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ శ్రేణి నాణ్యమైన బోధన చేయడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడమే ఐఐటీల లక్ష్యమన్నారు. అద్భుతమైన సవాళ్లకు సమాధానాలు చెబుతున్న అంకుర(స్టార్టప్) పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐఐటీ హైదరాబాద్ బోర్డు చైర్మన్ బీవీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త తరం ఐఐటీగా ఆధునిక శాస్త్ర సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలను చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు. ఐఐటీ హెచ్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ ఐఐటీ హెచ్ కేవలం సాంకేతిక పట్టభద్రులను ఉత్పత్తి చేయడమే కాకుండా పరిశోధకులను తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌భూషన్‌పానిగ్రాహి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వి.కాంచన, అడ్మిన్ డీన్ రంజిత్‌రామదురై, ఏసీఆర్ అడ్మిన్ డాక్టర్ ముద్రికాఖండేల్వాల్, ఎస్ఆర్‌సీ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌శర్మకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు.


సమావేశంలో అరవింద్‌శర్మ ఇతర నాయకులు

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం

- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ

ఎల్‌బీనగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. గురువారం గ్రీన్‌హిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశంతో పదవులను అనుభవించి పార్టీ మారడం బాధాకరమన్నారు. ఈ నెల 24న జిల్లెలగూడలోని ఎస్వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి పార్టీ శ్రేణులు భారీగా హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు రామాచారి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్‌గౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, దుబ్బాక శేఖర్, జగన్, వాజిద్ పటేల్, బాలునాయక్, బుజ్జిబాయి, కల్పన, హేమ, రేవతి పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

కొత్తపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల ఆరోగ్యానికి వైద్యుల సూచనలు పాటించాలని గడ్డిఅన్నారంలోని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్తు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ ఆయుర్వేద పరిశోధన అధికారి డా.సంతోష్ మానే, అసిస్టెంట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డా.జీపీ ప్రసాద్ అన్నారు. కొత్తపేటలోని రాధా మానసిక దివ్యాంగుల సంస్థలో గురువారం పోషణ పక్షంలో భాగంగా ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం పోషణ సూచనలున్న పోస్టర్లను, కరపత్రాలను, జొన్న లడ్డూలు పంపిణీ చేశారు. ఇనిస్టిట్యూట్ లైబ్రేరియన్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

చంపాపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భాష్యం విద్యాసంస్థల జడ్ఈఓ అంకమ్మరావు అన్నారు. చంపాపేట డివిజన్ సంతోష్‌నగర్ రోడ్‌లోని భాష్యం పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్ఈఓ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని ఆయన వ్యాయామ ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద టీఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ఉండే వ్యవసాయదారుడు పాలపాటి రాధయ్య(80) గురువారం సాయంత్రం ఎల్బీనగర్‌కు వచ్చాడు. ఆయన కుమారుడైన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పాలపాటి శ్యాంసుందర్ సరూర్‌నగర్‌లోని బహదూర్‌గూడలో ఉంటున్నారు. కుమారుడి ఇంటికి వెళ్లేందుకు రాధయ్య ఎల్బీనగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో ఉప్పల్ డిపోకు చెందిన టీఎస్ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలవడంతో రాధయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ద్వారా ఓ పాదచారుడు శ్యాంసుందర్‌కు సమాచారం అందించాడు. వెంటనే శ్యాంసుందర్ ఘటనాస్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సదరు టీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ చింతకింది నరేష్‌పై కేసు నమోదు చేసి ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశపెట్టి రూ.19.33లక్షలు కాజేశారు

- పార్ట్‌టైం, లైక్ కొట్టడమే పనంటూ మోసం

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా 61 ఏళ్లంటే రిటైర్మెంట్ వయసు. ఈ వయసులో కూడా పార్ట్‌టైం ఉద్యోగం చేసి సంపాదించి, కుటుంబానికి అండగా నిలవాలని ఓ వ్యక్తి భావించాడు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్ రీల్స్‌లో వచ్చే పార్ట్ టైం ఉద్యోగాల ప్రకటనలు చూసి, పార్ట్‌టైం జాబ్ చేసే ఉద్దేశంతో వారిని సంప్రదించాడు. సైబర్ నేరగాళ్లు అతడిని టెలిగ్రామ్ టాస్క్ గ్రూప్ 123లో జాయిన్ చేశారు. ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న ప్రాడక్ట్‌ను లైక్ చేయడం, స్క్రీన్‌షాట్ తీసి పంపితే సైబర్ నేరగాళ్లు ఖాతాలో డబ్బులు జమచేసేవారు. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే, పెట్టుబడితోపాటు వచ్చిన లాభం కూడా ఇస్తామని నమ్మించడంతో ఆ వ్యక్తి రూ.19.33 లక్షలు వారి ఖాతాలో జమచేశాడు. తర్వాత మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.